# నిర్ణయం

**అమూల్య పెళ్లిచూపుల ఏర్పాటు మా ఇంట్లోనే జరిగింది. అమూల్య కమల కూతురు.**

కమలకీ, నాకూ దూరపు బంధుత్వం ఉంది. బంధుత్వం కన్నా చిన్నప్పటి నుంచీ స్నేహమే ఎక్కువ. కాలేజీ చదువు పూర్తయే వరకూ కలిసే చదువుకున్నాం. తరవాత ఎవరి దారి వారిదైనా, మళ్లీ పదేళ్లపాటు ఒకే ఊళ్లో ఉన్నాం. వాళ్లాయనకీ మా ఆయనకీ ఈ ఊళ్లోనే ఉద్యోగం అవడం వల్ల. తరవాత వాళ్లకి నాగ్‌పూర్‌కి బదిలీ అయిపోయింది. అయినా, మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగడమే కాకుండా, ఈ ఊరొచ్చినప్పుడల్లా మా ఇంటికి రాకుండానూ, మా ఇంట్లో ఓ పూటయినా ఉండకుండానూ వెళ్లరు. వాళ్ల పిల్లలిద్దరికీ కూడా మా దగ్గర బాగా చనువు.

అమూల్య ఇప్పుడు నాగ్‌పూర్‌లోనే ఇకనామిక్స్ లెక్చరర్‌గా పని చేస్తోంది ఒక ఏడాది నుంచి. టెంపరరీ ఉద్యోగమే. పెళ్లి సంబంధాలు మూడేళ్ళనుంచీ చూస్తోంది కమల. భర్త నారాయణరావు ఉద్యోగ వ్యవహారాల్తో ఎప్పుడూ తీరిక లేకుండా ఉంటాడు. పిల్ల పెళ్లి గురించిన బాధ్యత అంతా తనదే అన్నట్లు తాపత్రయపడుతోంది కమల.

అలా అని, నారాయణరావు ఏమీ పట్టించుకోనట్లు ఊరుకోడు. అతనికి జాతకాల పట్టింపు చాలా వుంది. ఎంత మంచి కుర్రవాడైనా, ఎంత మంచి కుటుంబమైనా, జాతకాలు కుదరకపోతే - స్థూలంగా కుదరడమే కాదు - సూక్ష్మాంశాల్లో కూడా సంతృప్తికరంగా కుదిరితేగాని 'ఓ.కె' అనడు. అంచేత మేము సూచించిన సంబంధాలకి చాల వరకు పురిట్లోనే సంధి కొట్టింది!

జాతకాల్లో నమ్మకాలున్న ఛాందసులు కూడా చాలా మంది తక్కిన ముఖ్య విషయాల్లో ఏదైనా సంతృప్తికరంగా లేకపోతే, ఆ విషయాన్ని సూటిగా చెప్పలేక,జాతకాలు కుదరలేదని తప్పించుకోవడం నేనెరుగుదును. (జ్యోతిష్కులందరూ ఒక్కలా చూడరు, ఒక్కలా చెప్పరు

కదా!) జాతకం అనేది ఆపద్బాంధవిలా ఉపయోగపడుతుంది. శాసించడమే కాదు. లోపాయికారీగా సరిపుచ్చుకునే చిట్కాలుంటాయి. ఈ జాతకాల విషయంలో.

నారాయణమూర్తి అలా కాదు. ఏదైనా సంబంధాన్ని ఎవరైనా సూచిస్తే (తగిన సంబంధం అనుకున్నదే సూచిస్తారు కదా బంధుమిత్రులైతే), ముందుగా జ్యోతిష్కుడికి కుర్రవాడి జాతకం చూపిస్తాడు. అది కూడా ఎవరో ఒక జ్యోతిష్కుడికి కాదు - వాళ్ల కుటుంబానికి సన్నిహితుడైన జ్యోతిష్కుడికే. ఆయన చెప్పిందే వేదం. సరే, జాతకం కుదిరిందనుకుంటే, తల్లీ కూతుళ్లు రంగంలో కొస్తారు. కుటుంబ పరిస్థితులన్నీ క్షుణ్ణంగా కమల పరిశోధిస్తే, కుర్రవాడి రూపురేఖలూ, ప్రవర్తనా అమూల్య పరీక్షిస్తుంది.

ఈ పరిశోధనలూ, పరిశీలనలూ, పరీక్షలూ జరగడానికి ఎన్ని సానుకూలపడాలి ఈ కాలంలో. అమూల్య, తల్లిదండ్రులూ నాగ్‌పూర్‌లోనూ, పెళ్లికొడుకు ఏ కలకత్తాలోనో, బెంగుళూరులోనో, బొంబాయిలోనో, ఢిల్లీలోనో, అల్హాబాదులోనో, అమెరికాలోనో ఎక్కడో ఉంటాడు ఉద్యోగరీత్యా. కుర్రవాడి తల్లిదండ్రులు ఏ కాకినాడలోనో, విశాఖపట్టణంలోనో, గుంటూరులోనో, నెల్లూరులోనో ఉంటారు. కుర్రవాడి పినతండ్రో, మేనమామో, ఎవరో ఈ ఊళ్ళో మాకు బాగా తెలిసిన వాళ్లయి, వాళ్ల ద్వారా సంబంధం వస్తుంది. కుర్రాడి తల్లిదండ్రులూ, పిల్ల తల్లిదండ్రులూ కలుసుకోవాలి. పిల్లనీ, పిల్లవాణ్ణి చూడాలి. నచ్చితే పిల్లకీ పిల్లవాడికీ చూపులు ఏర్పాటు చెయ్యాలి. వీళ్ళు వాళ్ల ఊరైనా వెళ్లాలి, వాళ్లు వీళ్ల ఊరైనా రావాలి. లేదా, మధ్యలో మా ఊళ్లో కలుసుకోవాలి. అయినా, మళ్లీ ఒకరి ఇల్లు ఒకరు చూసుకోవాలి. వారి జీవన విధానం ఎలా ఉందో తెలుసుకోవడానికి. ఇటువైపు వాళ్ళకీ, అటువైపువాళ్లకీ సెలవలు దొరకాలి. మంచి రోజులు కుదరాలి - ఎంత తతంగం ఉంది! ఏ స్టేజ్‌లోనైనా సంబంధం నచ్చలేదనిపించవచ్చు.

బజారులో ఓ దుకాణంలో నూనె, ఓ దుకాణంలో మిరప్పొడీ, ఆవపొడీ, వగైరాలు కొని, ఓ చోట మామిడికాయలు కొని ముక్కలు కొట్టించి తీసుకొచ్చి ఇంట్లో ఊరగాయపెట్టడం అంత సులభంకాదు - పెళ్లి సంబంధాలు కుదర్చడం.

ఈ చిత్ర బంధంలో ఇరుక్కున్నాను నేను. మా ఆయనకి ఈ వ్యవహారాలంటే తలకాయ నొప్పి. కమల నా స్నేహితురాలు కాబట్టీ, నన్ను సంబంధాలు చూడమని బ్రతిమాలబట్టి నేను కలగజేసుకోక తప్పలేదు. నాగ్‌పూర్‌లో ఉంటూండటం వల్ల, తెలుగు వాళ్ల సంబంధాలు అక్కడ అనుకూలమైనవి దొరకడం లేదని, నా మీద మోపింది కొంత బాధ్యత.

క్రిందటి నెల్లో జరిగిన పెళ్లి చూపులు ఇక పెళ్లికి దారి తీస్తాయని గట్టి నమ్మకం కలిగింది నాకు. జాతకాలు బాగా సరిపోయాయని నారాయణరావు గారు పచ్చ జెండా చూపించారు. పెద్దవాళ్లకి ఒకరి కుటుంబ పరిస్థితులు మరొకరికి సంతృప్తి కలిగించాయి. హోదాలు సరితూగాయి! పిల్లా, పిల్లవాడూ అంద చందాల్లోనూ చదువు సంధ్యల్లోనూ ఒకరికొకరు తగినట్లుగా ఉన్నారు. కుర్రవాడి పేరు సుధాకర్. బెంగుళూరులో "ఇస్రో"లో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడు. అమూల్యకి అన్ని విధాలా తగినవాడనిపించాడు. ఏదో ఆఫీసుపని మీద ఈ ఊరొస్తున్నాడనీ, ఒకటి రెండురోజుల కన్న ఉండడనీ, వీలైతే ఆ సమయంలో అమూల్యని నాగ్‌పూర్ నుంచి పిలిపించగలరా అనీ సుధాకర్ వాళ్ల మేనమామ అడిగితే, సరేనని కమలకి ఫోన్ చేసి చెప్పాను. అమూల్య కాలేజీకి సెలవు పెట్టి వచ్చిందిక్కడికి. పెళ్లి చూపులయ్యాయి. ఇద్దరూ ప్రత్యేకంగా ఒకచోట కూర్చుని కొంతసేపు మాట్లాడుకున్నారు కూడాను.

కానీ, అమూల్య "నా నిర్ణయం వెంటనే చెప్పలేను ఆంటీ, నేనింకా ఆలోచించుకోవాలి' ' అంది నాగ్‌పూర్‌కి తిరిగి వెళ్లేముందు. సుధాకర్ మాత్రం అంగీకారం తెలిపినట్లున్నాడు - అతని తల్లిదండ్రులు మాకు కబురు పెట్టారు ఓ పదిరోజుల తరవాత - వాళ్లకీ సంబంధం నచ్చింది అంటూ. "కట్న కానుకలూ మాకు అక్కర్లేదు. పెళ్లి ఘనంగా చేస్తే చాలు" అని కూడా కబురు పెట్టారు. (ఘనంగా అంటే అథమం యాభైవేలు ఖర్చవుతుందని కొందరి అనుభవాల బట్టి తెలుసుకున్నాను). ఏమైనా, నారాయణరావు గారికీ కమలకీ ఖర్చుల బాధ లేదు.

బాధంతా అమూల్య గురించే. వాళ్లు ఒప్పుకున్న సంగతి ఫోన్‌లో చెప్పగానే కమల సంతోషించింది గాని, అంత ఉత్సాహం చూపించలేదు. అది పసిగట్టి, గుచ్చి గుచ్చి అడిగాను. "ఫోన్‌లో చెప్పడం కుదరదు. నేను వివరంగా ఉత్తరం రాస్తాను" అంది.

కమల దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. అమూల్య ఒక నిర్ణయానికి రాలేకపోతోందనీ, దానికి నచ్చజెబుతూ నన్ను ఉత్తరం రాయమనీ రాసింది. తల్లే నచ్చజెప్పలేకపోతే నేనేం చెయ్యగలను? ఇది అసలే సున్నితమైన వ్యవహారం. అమూల్య జీవితానికి సంబంధించిన విషయం. నేను వెంటనే జవాబు రాయలేదు.

తుఫానులా వచ్చింది కమల. వస్తున్నట్లు ముందుగా ఏ కబురూ లేకుండా వచ్చి, హడావిడిగా మూడుసార్లు వీధిగుమ్మం దగ్గర బెల్ నొక్కింది. వస్తూనే ప్రశ్నల వర్షం కురిపించింది.

"నా ఉత్తరం అందిందా? జవాబు రాయలేదేం? ఆ సంబంధం గురించి నీ అభిప్రాయం ఏమిటి? పోనీ, వేరే ఏదైనా చూశావా?" అంటూ.

"కూర్చో ముందు, తీరిగ్గా మాట్లాడుకుందాం" అని చెప్పి, చల్లని మంచి నీళ్ళిచ్చాను తాగడానికి. కుశల ప్రశ్నలు వేశాను - తన రాక గురించి తెలుసుకుందామని. నారాయణరావుకి ఏదో సెమినార్ ఉందిట ఇక్కడ. అతనితో బాటు తనూ వచ్చిందిట. ఇద్దరూ అతని ఆఫీసు గెస్టుహౌస్‌లో దిగారుట. రేపు సాయంత్రం తిరుగు ప్రయాణం అని చెప్పింది.

మంచి నీళ్లు సగం తాగి గ్లాసు పక్కన పెడుతూ, మళ్లీ అడిగింది ఆ సంబంధం గురించి నేనేమనుకుంటున్నదీ రాయలేదేమని... ఏం రాయను? వాళ్ల నమ్మకాలు వాళ్లవి, వాళ్ల ఊహలు వాళ్లవి. నేను చెప్పినట్లు వింటారు కనకనా? తెలిసిన మంచి సంబంధాలు సూచించగలం గాని, ఒప్పుకోమని గట్టిగా నొక్కి చెప్పలేం కదా మన వాళ్లకయినా!

"అమూల్య ఏమంటోంది?" అన్నాను చిరునవ్వు నవ్వుతూ.

నా ప్రశ్నకి సమాధానం చెప్పకుండా హేండ్ బేగ్ తెరిచి ఓ ఉత్తరం తీసి నా చేతికిస్తూ -

"అమూల్య రాసింది నీకు" అంది. ఉత్తరం తీసుకుని చదవసాగాను.

"ఆంటీ డియర్,

నేను సందిగ్ధావస్థలో ఉన్నాను. సుధాకర్ విషయంలో నిర్ణయం మమ్మీ నాకే వదిలేశానంటోంది. కానీ నేను ఎటూ నిర్ణయించుకోలేకుండా ఉన్నాను. అతను అందంగా లేడనీ, మంచి పొజిషన్‌లో లేడనీ కాదు. అన్నీ పైకి బాగానే ఉన్నాయి. కానీ అతనితో మాట్లాడాక ఎందుకో ఒక కచ్చితమైన నిర్ణయానికి రాలేక పోతున్నాను. అతన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు. అతనికి వ్యక్తిగతంగా సింపుల్‌గా రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకోవడం ఇష్టంట. కానీ, వాళ్ల అమ్మా, నాన్నగార్ల మనసుల్ని కష్టపెట్టడం ఇష్టం లేక సాంప్రదాయ బద్ధంగా వివాహం చేసుకోవాలనుకుంటున్నాడుట. అంటే ఇక ప్రతి విషయంలోనూ అతని ధోరణి అదే అనుకోవాలా..?"

సొంత అభిప్రాయాలంటూ ఉన్నాయిగా! కొన్ని విషయాల్లో సర్దుకుపోవడంలో తప్పులేదనుకున్నాడేమో. కట్నం తీసుకోవడం లేదుగా. అంతవరకు నయమే.

"... ఇంకోటి - అమెరికా వెళ్లాలనీ, అక్కడ ఉద్యోగం చెయ్యాలనీ ఏమైనా అనుకుంటున్నారా అని అడిగాను అతన్ని - ఎందుకంటే, ముఖ్యంగా నా ఉద్యోగంలో ఇంకా ఎంతో సాధించాలని ఉంది నాకు. అమెరికాలో అయితే అవకాశాలు ఎక్కువ కదా. సుధాకర్ మాత్రం ఆ విషయమై ఇప్పుడప్పుడే ఏమీ చెప్పలేనన్నాడు. భావి జీవితం గురించి అతని అభిప్రాయాలేమిటని అడిగాను. తనకేమీ స్పష్టమైన ఉద్దేశం లేదుట. ఎలా ఉంటుందో చూడాలి అన్నాడు వేదాంత

ధోరణిలో అన్నట్లు! ఇటువంటి వాడితో నేను జీవితమంతా గడపగలనా అనిపిస్తోంది ఆంటీ..."

ఆ భయానికర్థం లేదు. భవిష్యత్తంతా మన అధీనంలో ఉంటుందా? అనుకున్నవన్నీ అవుతాయా?

"... పైగా, సరదాగా చిలిపిగా మాట్లాడేరకంలాలేడు. గంభీరంగా మొహం పెట్టుకుని అడిగినవాటికి ముక్తసరిగా సమాధానాలిస్తాడు. హిందుస్థానీ సంగీతం ఇష్టమేనా అని అడిగితే, అప్పుడప్పుడు వినడానికి నాకు అభ్యంతరం లేదన్నాడు! అదేనా మాట్లాడేతీరు! నా అభిరుచులేమిటని కూడా అడగలేదు. 'బోర్' అనిపించింది.."

ఇప్పుడు చిలిపిగా సరదాగా ఉంటే, పెళ్లయాక జీవితమంతా అలా ఉంటాడని నమ్మకమా? పిచ్చి పిల్లా! 'బోర్'అన్న మాట మరిచిపో, సుఖపడతావు. నీ ఆనందం ఎవరి ద్వారానో, దేని ద్వారానో దొరుకుతుందనుకోవడం భ్రమ!

"అమ్మ భయపడుతోంది - మంచి సంబంధం చెయ్యి జారి పోతుందేమోనని. అలా అని నేను ఒప్పేసుకోనా? ఇంతకు ముందొచ్చిన సంబంధాల్లో అమెరికాలో ఉంటున్న కుర్రవాళ్లున్నారు. కానీ వాళ్ల జాతకాలు సరిగా లేవని - అందులో ఒకరికి 'మారకం' ఉందనీ, మరొకరికి 'ద్వితీయ కళత్రయోగము' ఉందనీ కొట్టి పారేశారు నాన్నగారు. ఇప్పుడీ సుధాకర్ అందరికీ నచ్చాడు. నాకూ బాగానే ఉన్నాడనిపించింది పైపైకి. కానీ, అతని మాటల ధోరణి బట్టి అతని స్వభావం నాకు అంతు బట్టడం లేదు ఆంటీ. అతన్ని మళ్లీ ఓసారి కలుసుకుని మాట్లాడితే మంచిదంటారా?..."

ఎన్నిసార్లు మాట్లాడినా ఏం లాభం? మనిషి స్వభావాన్ని అంత చులాగ్గా అంచనా వెయ్యగలమా? మాటలు వేరు, ప్రవర్తన వేరు. అప్పుడప్పుడు కలుసుకోవడం వేరు, కలిసి ఉండటం వేరు. అంచనాలు ప్రమాదకరం. తప్పితే, ఫలితంగా నిరాశ, నిస్పృహ, ఆవేదన!

"...పూర్వపురోజుల్లోనైనా పుట్టాను కాను. ఎవరో ఒకర్ని కట్టబెట్టేవారు...ఏ సంగతీ నిర్ణయించుకుని చెప్పమని తొందర పెడుతోంది అమ్మ... మీ సలహా ఏమిటి?.."

ఉత్తరం మడిచి, కమలకేసి చూసి చిరునవ్వు నవ్వాను. కమల ఆత్రుతగా చూసింది నాకేసి.

"ఈ రోజుల్లో కూడా ఈ పెళ్లి చూపులూ, పెద్దవాళ్లు, సంబంధాలు కుదర్చడం - వీటితో వచ్చిన ఇబ్బందే ఇది!" అన్నాను.

"ఈ రోజుల్లో అయితే మాత్రం? వాళ్ళ పాటున వాళ్లకొదిలేసి తల్లిదండ్రులు చేతులు ముడుచుక్కూర్చోవాలనా?" అంది కమల నిరసనగా.

"అది కాదు కమలా, పెద్దచదువులు చెప్పించారు, తగిన వయస్సుంది. ఆర్థికంగా కూడా స్తోమత ఏర్పడుతోంది. ఇంక తనంతట తనే తన జీవిత భాగస్వామిని ఎంచుకోవచ్చు కదా. అందుకు మనం ప్రోత్సహించాలి" అన్నాను.

"దాని మొహం, ఏం ఎంచుకుంటుంది? దాని డిపార్ట్ మెంట్ వాళ్లలో ఎంచుకునేందుకు ఎవరున్నారు? ఒకల్లిద్దరు యోగ్యులుగా కనిపించినా వాళ్లు పెళ్లయిపోయినవాళ్లే, లేదా, ఇంకేదో లోపాలున్న వాళ్లు. దానికి పరిచయస్థులెంతమంది ఉన్నారని? ఇంతకు ముందు చదువుకుంటున్న వాళ్లతోనే పరిచయం. వాళ్లు కుర్రకుంకలు.."

"సరేలే, ప్రేమించేముందు ఇవన్నీ ఆలోచిస్తారా?" అన్నాను నవ్వుతూ.

"అందుకే ప్రేమ గుడ్డిదన్నారు! పెళ్లనగానే ముందూ వెనకా ఆలోచించుకోవద్దూ? పెళ్లంటే నూరేళ్ల పంట! ఆచి తూచి అడుగు వెయ్యాలి.."

"అవును కమలా, పెళ్లి "నూరేళ్ల పంట" అనుకోవడం వల్లే సంబంధం కుదర్చడం, కుదుర్చుకోవడం ఇంత కష్టమవుతోంది. మీ ఆయన జాతకాలు చూపిస్తారు - జీవితాంతం కలిసి మెలిసి ఉంటారా లేదా, దీర్ఘాయుష్మంతుడవునా కాదా, భోగభాగ్యాలతో తులతూగుతారా లేదా, పిల్లలు పుడతారా లేదా - ఇలాంటివన్నీ తెలుసుకోవడానికి. నిజం చెప్పు. జాతకాలు చూసి పెళ్లి చేసుకున్న వాళ్లందరూ కలకాలం కలిసి బతుకుతున్నారా, కలిసి మెలిసి జీవిస్తున్నారా? ఎంతమంది స్త్రీలు నడివయస్సు రాకుండానే వితంతువులు కావడం లేదు? ఎంతమంది విడిపోవడం లేదు. పిల్లలు పుట్టాక కూడా ఎంత మంది కలతలతో కుమిలిపోతూ కాపురాలు చెయ్యడం లేదు? ఎంతమంది ఆత్మహత్యలు చేసుకోవడం లేదు?.."

కమల మధ్యలో అడ్డుకుని, "శుభం పలకరా మంకెన్నా అంటే ఏదో అన్నట్లు నువ్వు మరీ అలా మాట్లాడతావేమిటి? మన ముందు జాగ్రత్త కొద్దీ మనం చూసుకుంటాం జాతకాలు. ఆ తరవాత వాళ్ల కర్మని బట్టి ఉంటుంది" అంది.

"అదే చెబుతున్నాను. ఇప్పుడు అమూల్య కూడా అదే ధోరణిలో ఆలోచిస్తోంది. - పెళ్లి 'నూరేళ్ల పంట' జీవితాంతం ఫలానా వ్యక్తితో నేను సుఖంగా బతకగలనా - అని. వివాహ బంధం శాశ్వతంగా ఉండాలనీ, ఉంటుందనీ మన నమ్మకం! కానీ నిజంగా శాశ్వతమా? ఎవరో ఒకరు ముందుపోక తప్పదు కదా - అయ్యో, వీళ్లు ఒంటరిగా ఎలా బతుకుతారు, పిల్లలతో ఎలా తంటాలు పడతారు - అని ఆగుతుందా మృత్యువు?.."

కమల నిర్ఘాంతపోయినట్లు చూస్తోంది నావైపు! నేను కొనసాగించాను.

"... అలాగే, వివాహం చేసుకున్నాక ఆ వ్యక్తితో కాపురం చేయడం అసంభవం అనిపిస్తే విడిపోక తప్పదు, పర్యవసానాలు ఎలా ఉన్నా. ఇవ్వాళ నచ్చిన వ్యక్తి జీవితాంతం తనకు

నచ్చేటట్లు ప్రవర్తిస్తాడన్న హామి ఉందా? అతనికి నచ్చ విధంగా జీవితాంతం తను నడుచుకోగలదా?.. కలిసి ఉండాలనుకున్నప్పుడు - బ్రతికున్నన్నాళ్లూ ఆ వివాహబంధం సుస్థిరంగా ఉండాలనుకున్నప్పుడు ఒకరినొకరు నిత్యం అవగాహన చేసుకుంటూ, అహాన్ని కొంత త్యాగం చెయ్యక తప్పదు ఇద్దరికీ - ఎవర్ని చేసుకున్నా అంతే. అది అర్థం చేసుకుంటే, ఈ విషయంలో అమూల్య సులభంగా ఒక నిర్ణయానికి రాగలుగుతుంది. ఇప్పుడు మీ దగ్గరున్న స్వేచ్ఛ, సుఖాలూ ఇక ముందు కూడా ఇదే ప్రకారంగా కొనసాగాలనో, ఇంకా ఎక్కువ సుఖాలు కావాలనో అమూల్య తీవ్రంగా కోరుకోవడం సహజం. కానీ, భవిష్యత్తులో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోగల మనస్థైర్యాన్ని అలవరుచుకోవాలి. అంతేగాని, మన ఊహల ప్రకారమే జీవితం సాగాలంటే ఎల్లప్పుడూ సాగదు. దేనికైనా సిద్ధపడి ఉండాలి మానసికంగా.." అంటూ నేనింకా కొనసాగించబోతూంటే కమల అడ్డుకుని,

"నీకు ఏ బాదరా బందీ లేదు కాబట్టి ఈ కబుర్లన్నీ చెప్పగలుగుతున్నావ్!" అంది కుర్చీలోంచి లేస్తూ.

కమల నన్ను సరిగ్గా అర్థం చేసుకోనట్టుంది!

ఇంక నేనేం మాట్లాడను?

"కాఫీ చేస్తానుండు" అంటు నేనూ లేచాను.

అమూల్య అర్థం చేసుకుంటే చేసుకుంటుంది. లేకపోతే లేదు - తనకి కూడా నా మనసులో ఉన్నట్లే రాయాలని నిశ్చయించుకున్నాను.

*భూమిక, జనవరి - మార్చి 1993.*